# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో నవంబరు 14,15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
3. **ప్రభుత్వ వైద్య కళాశాలల్లో గైనిక్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాలిటీ కోర్సుల్లో అదనంగా 106 పీజీ సీట్ల భర్తీకి జాతీయ వైద్య కమిషన్ ఆమోదం తెలిపింది.**
4. **పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడించారు.**

==========================

విశాఖపట్నంలో నవంబరు 14,15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పరిశ్రమల శాఖా, ఆర్థికాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా సూచించారు. కేవలం రాష్ట్రానికి పెట్టుబడుల కోసమే కాకుండా జ్ఞాన భాగస్వామ్యం, లాజిస్టిక్స్, టెక్నాలజీ వంటి రంగాల్లో విధానాలపై ఉన్నత స్థాయి చర్చలకు సదస్సు వేదిక కానుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని అవకాశాలు సృష్టించేందుకు ఉపయోగపడేలా సదస్సు నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

--------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆస్ట్రేలియా-ఇండియా సీఈవో ఫోరం డైరెక్టర్ జోడి మెక్ కేతో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. పెట్టుబడులకు గమ్య స్థానంగా మారుతున్న ఆంధ్రప్రదేశ్‌ను తమ స్టేట్ ఎంగేజ్‌మెంట్ అజెండాలో చేర్చాలని లోకేష్ ఫోరమ్‌ను కోరారు. అనంతరం జరిగిన

ప్రవాసాంధ్రుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

ధర్తీ ఆబా జనభాగీదారీ అభియాన్'లో ఉత్తమ పనితీరు కనబరిచి జిల్లా అవార్డును అందుకున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పరిపాలన, భాగస్వాములను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ యస్. నజీర్ అభినందించారు. ఇతర గిరిజన జిల్లాలూ అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంకితభావం, సమష్టి కృషితో ఈ విజయాన్ని సాధ్యం చేసిన జిల్లా యంత్రాంగం, భాగస్వాములందరికీ హృదయపూర్వక అభినందనలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

---------------------------

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి గ్రామానికీ రక్షిత నీటి భద్రత లక్ష్యంగా జలజీవన్ మిషన్ పనులు రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ పథకం విస్తరణలో భాగంగా ఏడాదిలో ఐదు జిల్లాల్లో 7 వేల 910 కోట్ల రూపాయల పనులు ప్రారంభించామని, ఇవి పూర్తయితే కోటి మంది దాహార్తి తీరుతుందని పేర్కొంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌ల అభ్యర్థనతో జలజీవన్ మిషన్ నిర్దేశిత గడువును కేంద్రం నాలుగేళ్లు పొడిగించినట్లు తెలిపింది. రోజుకు ప్రతి వ్యక్తికి 55 లీటర్ల రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యసాధన దిశగా పనులు సాగుతున్నట్లు మంత్రిత్వశాఖ వివరించింది.

---------------------------

పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ నెల 21వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో పోలీసు సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిలుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లాల్లో పోలీసు ఆయుధాల ప్రదర్శన, పోలీసు అమరవీరుల కుటుంబాలకు పరామర్శ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. వైద్య శిబిరాలు, మారథాన్‌లు, కొవ్వొత్తుల ర్యాలీలు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ఏర్పాటుకు సంబంధించిన సోలార్ ప్యానల్స్, ఇతర పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ఏర్పాటు చేసుకునే వారికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోందని, ఇప్పుడు జీఎస్టీ కూడా 12 నుంచి 5 శాతానికి తగ్గించడంతో ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని ప్రకాశం జిల్లా నెడ్ క్యాప్ నోడల్ అధికారి పి.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. జీఎస్టీ 2.0లో ధరలు తగ్గడంతో ప్రజలు పీఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని ఆయన ఆకాశవాణికి తెలుపుతూ..

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో గైనిక్, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాలిటీ కోర్సుల్లో అదనంగా 106 పీజీ సీట్ల భర్తీకి జాతీయ వైద్య కమిషన్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వైద్య కళాశాలల్లో నంద్యాల, రాజమహేంద్రవరం కళాశాలలకు 16 చొప్పున, మచిలీపట్నం, విజయనగరం కళాశాలలకు 12 చొప్పున, ఏలూరు కళాశాలకు నాలుగు సీట్లు కొత్తగా వచ్చాయని వెల్లడించారు. పాత వైద్య కళాశాలల్లో అనంతపురానికి 15, శ్రీకాకుళం ఎనిమిది, కడప ఏడు, కర్నూలు నాలుగు, గుంటూరు వైద్య కళాశాలలో రేడియాలజీ, విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్, పీడియాట్రిక్స్‌లో నాలుగు చొప్పున అదనపు సీట్లు వచ్చాయని వివరించారు.

-----------------------------

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై తిరుపతి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రైతులు కొనుగోలు చేసే పనిముట్లు, ఇతర సామగ్రిపై జీరోశాతం జిఎస్టిని తీసుకొచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి చెందిన జలగం శ్యాంసుందర్ అనే రైతు ధన్యవాదాలు చెబుతున్నారు. కేంద్రప్రభుత్వం నిర్ణయం తమకు ఎంతగానో ఊరటనిస్తుందని తెలియజేస్తూ..

...వాయిస్.. 31 సెకన్లు

-----------------------------

దక్షిణ అండమాన్ సముద్రం, దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో, రాష్ట్రంలోని పలు జిల్లాలో ఈరోజు నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

..వాయిస్..20 సెకన్లు

======================